లోకల్‌కోటా కౌన్సిలింగ్‌లో పాల్గొనేలా అర్హత కల్పించాలి

- సిఎంకు సిపిఎం లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో ఒకటి నుండి పదో తరగతి వరకు చదివి, ఇంటర్మీడియట్ ఆంధ్రప్రదేశ్‌లో చదివిన విద్యార్థులను తెలంగాణ లోకల్ విద్యార్థులుగా పరిగణిస్తూ, నీట్-2024 అడ్మిషన్‌లో లోకల్‌కోటా కౌన్సిలింగ్‌లో పాల్గొనేలా అర్హత కల్పించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ సిఎం రేవంత్‌రెడ్డికి గురువారం లేఖ రాశారు. 'రాష్ట్ర సరిహద్దు జిల్లాలకు చెందిన కొంతమంది విద్యార్థులు ఒకటి నుండి పదో తరగతి వరకు రాష్ట్రంలో చదివి, ఇంటర్మీడియట్ విద్యను ఆంధ్రప్రదేశ్‌లో చదివారు. 2017 జులై5న జారీ చేసిన జిఒ 114 ప్రకారం ఏడు సంవత్సరాల్లో నాలుగేళ్లు చదివిన వారికి లోకల్ కోటాలో అవకాశమి చ్చేవారు. కానీ ఈ విద్యార్థులను స్థానిక కోటాలో పరిగణించబోమని 2024 జూలై 19న జిఒ నెం.33ను ప్రభుత్వం తెచ్చింది. కానీ ఈ విద్యార్థులు మార్చి 2024లోనే ఇంటర్‌మీడియట్ పూర్తిచేసే నాటికి ఈ జీవో నిబంధనలు రాలేదు. ప్రస్తుతం తెచ్చిన జీవో నంబర్ 33 ద్వారా ఈ విద్యార్థులు స్థానికత కోల్పోవడంతో వీరి భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. ర్యాంక్ సాధించినా, మెడికల్ సీటు రాని పరిస్థితి ఏర్పడిరది. దీంతో నిరాశ, నిస్పృహ, మానసిక క్షోభకు విద్యార్థులు గురవుతున్నారు'. ఈ సమస్యను పరిశీలించి, వారిని లోకల్‌విద్యార్థులుగా పరిగణించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు.

పేద విద్యార్థుల స్కాలర్ షిప్పులను వంద శాతం పెంచాలి

- కేంద్రాన్ని కోరిన మంత్రి అడ్లూరి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రీ, ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌లను పెంచాలనీ, పేద విద్యార్థులకు ఇచ్చే ఉపకారం వేతనాలను వంద శాతం మేర పెంచాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. 'వికసిత్ భారత్-2047" దిశగా సమాజంలోని మార్జినలైజ్డ్ సెక్షన్ల అభివృద్ధి రోడ్‌మ్యాప్ రూపకల్పనలో భాగంగా గురువారం జరిగిన కేంద్ర సామాజిక న్యాయ, సాధికారిత మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్ అన్ని రాష్ట్రాల సంక్షేమ మంత్రులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి కేంద్రానికి పలు సూచనలు చేశారు. ప్రి, ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌లను 60 శాతం నుంచి 75 శాతానికి పెంచాలని కోరారు. తెలంగాణలోని ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ, పేద కుటుంబాల విద్యార్థులు ఐఐటి, ఐఐఎం,ఎన్‌ఐటిల్లో ఎక్కువగా సీట్లు సాధిస్తున్నారని, అలాంటి ప్రతిభావంతులందరికీ వంద శాతం పెంచి, స్కాలర్‌షిప్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఎస్‌సి హాస్టళు పురాతన స్థితిలో ఉన్నందున, కొత్తగా ఆధునిక హాస్టళ్ల నిర్మాణానికి కేంద్రం నుంచి నిధులు కేటాయించాలని కోరారు. వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్ల నిర్మాణానికి ప్రత్యేకంగా నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఎస్‌సిలలో చాలామందికి ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్ధిదారులు అధికంగా ఉన్నందున పేదలకు గృహనిర్మాణంలో కేంద్రం ఆర్థిక సహకారం అందించాలని కోరారు. వృద్ధాప్య పింఛన్లను కేంద్రం 68-79 ఏళ్ల వారికి నెలకు రూ.200, 80 ఏళ్లకు పైబడిన వారికి రూ.500 మాత్రమే ఇస్తోందని, మానవతా దృక్పథంతో ఈ సహాయాన్ని పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. వికలాంగులకు తెలంగాణ ప్రభుత్వం నెలకు రూ.4,000 ఇస్తోందని, ఈ దిశగా కేంద్రం కూడా ముందడుగు వేయాలని కోరారు.

శ్రీచైతన్య విద్యాసంస్థల 'ఎఐఎన్‌ఎ' ఆవిష్కరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శ్రీచైతన్య విద్యాసంస్థల్లో భాగమైన ఇన్ఫినిటీ లెర్న్ నుంచి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నర్తరింగ్ అసిస్టెంట్ (ఎఐఎన్‌ఎ) విప్లవాత్మకమైన నూతన ఆవిష్కరణను గురువారం హైదరాబాద్‌లో విడుదల చేసింది. ఎఐఎన్‌ఎ దేశంలోనే వాయిస్ ఫస్ట్ ఏఐ ఆధారి మెంటార్. ఈ సందర్భంగా శ్రీచైతన్య విద్యాసంస్థల సిఇఒ, డైరెక్టర్ సుష్మ బొప్పన మాట్లాడుతూ.. సరైన సాధనాలు, వ్యక్తిగత పద్ధతి, సాంకేతిక మద్దతు కలిసి వచ్చినపుడు నేర్చుకోవడం నిజమైన మార్పుని తెస్తుందన్నారు. ఎఐఎన్‌ఎ ద్వారా ప్రతి విద్యార్థికి ఒక విశ్వసనీయ మెంటార్ లభిస్తాడని వివరించారు. సమాధానాలు మాత్రమే కాకుండా ఆత్మవిశ్వాసం, ప్రేరణ కూడా అందిస్తూ విద్యార్థుల అసలైన సామర్థ్యాన్ని వెలికి తీయడమే లక్ష్యమన్నారు. ఇన్ఫినిటీ లెర్న్ వ్యవస్థాపక సిఇఒ ఉజ్వల్‌సింగ్ మాట్లాడుతూ... భారతీయ విద్యార్థుల ఓసం మేధస్సుతో కూడిన మానవ కేంద్రీకృత మార్గదర్శకత్వంలో కొత్త శకాన్ని ప్రారంభిస్తున్నామని వివరించారు. గూగుల్ క్లౌడ్, ఐఐటీ హైదరాబాద్ సహకారంతో రూపొందిన ఈ టెక్నాలజీ ఇప్పటికే 96.7 శాతం కచ్చితత్వంతో సమాధానాలను ఇస్తున్నదని చెప్పారు. నెలకు రెండు లక్షలకుపైగా విద్యార్థుల సందేహాలను సగటున ఐదు సెకన్లలో పరిష్కరిస్తోందన్నారు. ఇంగ్లీష్‌తోపాటు తొమ్మిది భారతీయ భాషల్లో సహాయం అందిస్తోందని అన్నారు. ఎఐఎన్‌ఎ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడానికి https://tinyuri.com/aina జూతీం ను సంప్రదించాలని సూచించారు.

కెటిఆర్‌కు 'గ్రీన్ లీడర్‌షిప్' అవార్డు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు అరుదైన గౌరవం లభించింది. సుస్థిర పాలన, పర్యావరణ పరిరక్షణలో ఆయన చేసిన కృషికిగాను ప్రతిష్టాత్మకమైన 'గ్రీన్ లీడర్‌షిప్ అవార్డు 2025'కు ఆయన ఎంపికయ్యారు. ఈ అవార్డు ప్రదానోత్సవం సెప్టెంబర్ 24న న్యూయార్క్‌లో జరగనున్న 9వ ఎన్‌వైసి గ్రీన్ స్కూల్ కాన్ఫరెన్స్‌లో జరగనుంది. ఈ విషయాన్ని గ్రీన్ మెంటార్స్ సంస్థ అధికారికంగా కెటిఆర్‌కు తెలియజేసింది. "గ్రీన్ మెంటార్స్ తరపున, గ్రీన్ లీడర్‌షిప్ అవార్డు -2025 గ్రహీతగా మీ ఎంపికను ధృవీకరించడం మాకు ఒక విశేషం" అని వారు లేఖలో పేర్కొన్నారు.

అందరి చరిత్రను హైజాక్ చేస్తోన్న బిజెపి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఏ చరిత్రా లేని బిజెపి, అందరి చరిత్రను తనదంటూ హైజాక్ చేసుకుంటూ దుష్ట రాజకీయాలకు పాల్పడుతోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట 77వ వారోత్సవాలు గురువారం ఆ పార్టీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వద్ద రైతాంగ సాయుధ పోరాట యోధుడు మఖ్దూం మోహియుద్దీన్ విగ్రహానికి సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్, జాతీయ కౌన్సిల్ సభ్యులు పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి. నరసింహాతో కలిసి కూనంనేని పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వరకు 'రెడ్ ఫ్లాగ్ మార్చ్' నిర్వహించారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్ అధ్యక్షతన జరిగిన సభలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ... తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కాలం నాటికి అసలు ఉనికే లేని బిజెపి విమోచన దినోత్సవం పేరుతో సెప్టెంబర్17న ఉత్సవాలను నిర్వహించడం హాస్యాస్పదమన్నారు. వర్గపోరాటాన్ని మతపోరాటంగా చూపిస్తూ చరిత్రను బిజెపి వక్రీకరిస్తోందని విమర్శించారు. "కమ్యూనిస్టుల చరిత్ర చెరిపేయలేము. అమరుల త్యాగాలకు వెలకట్టలేము" అని స్పష్టం చేశారు. అజీజ్ పాషా మాట్లాడుతూ... చరిత్రను ఎవరు వక్రీకరించినా... చరిత్ర ఎప్పటికీ చరిత్రగానే నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.ఛాయాదేవి, రాష్ట్ర నాయకులు బి.వెంకటేశం, పి.ప్రేమ్ పావని, ఎం.నర్సింహ్మా, ఎం.ధర్మేంద్ర, ఎం.అనిల్ కుమార్, కమతం యాదగిరి, ప్రజానాట్యమండలి అధ్యక్షులు కె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ్మా, లక్ష్మినారాయణతో పాటు సిపిఐ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఫ్యూచర్ సిటీ నుంచి బందరు పోర్ట్ గ్రీన్ ఫీల్డ్ హై వేకు అనుసంధానంగా రైల్వే లైన్

- చెన్నై, బెంగళూరులకు హై స్పీడ్ రైళ్లు
- పెండింగ్ రైల్వే ప్రాజెక్టులు పూర్తి చేయండి
- ద మ రైల్వే జిఎంతో సిఎం రేవంత్

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో



పెండింగ్‌లో ఉన్న రైలు ప్రాజెక్టులు, లైన్లను వేగవంతంగా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అవసరమైన నిధులను సమకూర్చటంతో పాటు భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టుల అలైన్మెంట్లు ఉండాలని దూరాభారం తగ్గించి, అంచనా ఖర్చును కూడా తగ్గించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రయాణికులకు వేగవంతమైన రవాణా సదుపాయాలు అందించడంతో పాటు కొత్తగా వేసే రైలు మార్గాలన్నీ ఆయా ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి ఉపయోగపడేలా ఉండాలన్నారు. ప్రధానంగా పర్యాటక కేంద్రాలు, పారిశ్రామిక అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. విదేశాల తరహాలో రైలు, రోడ్డు, పోర్ట్ కనెక్టివిటీని అధునాతనంగా అభివృద్ధి చేయాలన్నారు.

రాష్ట్రంలో పెండింగ్ రైల్వే ప్రాజెక్టులు, కొత్తగా ప్రతిపాదనలో ఉన్న ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం కమాండ్ కంట్రోల్ సెంటర్లో దక్షిణ మధ్య రైల్వే అధికారులతో పాటు, వివిధ విభాగాల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశానికి హాజరైన దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవను ముఖ్యమంత్రి స్వాగతించారు. కొత్త ప్రాజెక్టులపై ఆయనతో ప్రత్యేకంగా చర్చించారు. సిఎంతో పాటు ఎంపి కడియం కావ్య, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్ అండ్ బీ స్పెషల్ సెక్రెటరీ వికాసరాజ్, సిఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాసరాజు, ఆర్థిక శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఈ సమావేశంలో పాల్గొన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్టు వరకు గ్రీన్ ఫీల్డ్ హైవేతో పాటు అనుసంధానంగా రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలోని హామీ ప్రకారం హైదరాబాద్ నుంచి అమరావతికి ర్యాపిడ్ రైల్ అండ్ రోడ్డు కనెక్టివిటీ ప్రాజెక్టును కేంద్రం అమలు చేయాల్సి ఉందన్నారు. కొత్తగా ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందర్ వరకు 12 లేన్ల గ్రీన్ ఫీల్డ్ హైవే ఏర్పాటు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశామని, అందుకు సంబంధించి 300 కిలోమీటర్ల అలైన్మెంట్ ప్రతిపాదనలను కూడా రాష్ట్ర ప్రభుత్వం తయారు చేసిందన్నారు. దానికి అనుగుణంగా రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని, రైల్వే విభాగం పరిశీలనలో ఉన్న అలైన్మెంట్తో పాటు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసిన అలైన్మెంట్నుపరిశీలించి భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని ముఖ్యమంత్రి సూచించారు. హైవే వెంట రైలుమార్గం ఉండాలని, హైవేకు ఇరువైపులా కిలోమీటర్నర దూరం వరకు ఇండస్ట్రియల్ కారిడార్ను విస్తరించాలనే ప్రతిపాదనలున్నాయని చెప్పారు. కొత్తగా అభివద్ధి చేస్తున్న గ్రీన్ఫీల్డ్ హైవే ప్రతిపాదనలకు అనుగుణంగా హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్- బెంగళూరు హైస్పీడ్ రైలు ప్రాజెక్టుల సర్వే, అలైన్మెంట్ ప్రతిపాదనలను మరోసారి పరిశీలించాలని ముఖ్యమంత్రి రైల్వే అధికారులకు సూచించారు. హైదరాబాద్ చుట్టూ రీజనల్ రింగ్ రైల్ ఆవశ్యకతను ముఖ్యమంత్రి అధికారులకు వివరించారు. దాదాపు 362 కిలోమీటర్ల మేరకు రీజనల్ రింగ్ రోడ్డు వెంట రింగ్ రైలు ఏర్పాటు చేయటంతో హైదరాబాద్ మహా నగరం భవిష్యత్తు స్వరూపం మారిపోతుందన్నారు. వీలైనంత తొందరగా ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రైల్వే అధికారులకు సిఎం సూచించారు. తెలంగాణ ఇండస్ట్రియల్ సెక్టార్ కోసం ప్రత్యేక రైల్వే లైన్ ఉండేలా ఈ కనెక్టివిటీ ఉండాలని సిఎం అభిప్రాయపడ్డారు. వికారాబాద్- కృష్ణా కొత్త రైల్వే లైన్ పనులను వీలైనంత త్వరగా చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. దీంతో పాటు గద్వాల-డోర్నకల్ రైల్వే లైన్ పనుల డీపీఆర్ పూర్తి చేసి వేగంగా చేపట్టాలన్నారు. వరంగల్లోనూ రైల్వే లైన్లను అభివద్ధి చేయాలని, భూపాలపల్లి నుంచి వరంగల్ కొత్త మార్గాన్ని పరిశీలించాలని సూచించారు. కాజీపేట జంక్షన్లో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా అభివద్ధి పనులు చేపట్టాలని అన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్‌తో పాటు వరంగల్‌ను అభివృద్ధి చేయాలని, అందుకు అనుగుణంగా రైల్వే ప్రాజెక్టులను చేపట్టాలని ముఖ్యమంత్రి రైల్వే అధికారులకు సూచించారు.

టాప్ డిగ్రీ కాలేజీల్లో సీట్లున్నాయ్

- ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోనే నిజాం కాలేజీలో 1,197 సీట్లుంటే ఇప్పటి వరకు 992 మంది ప్రవేశాలు పొందారు. ఇంకా 205 సీట్లున్నాయి. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం కోఠిలో 1,850 సీట్లుండగా, ఇప్పటి వరకు 1,587 మంది చేరారు. ఇంకా 263 సీట్లు ఖాళీగా ఉన్నాయి. బేగంపేట మహిళా డిగ్రీ కాలేజీలో 1,860 సీట్లకుగాను 1,593 మంది ప్రవేశాలు పొందారు. ఇంకా 267 సీట్లున్నాయి. ఇందిరా ప్రియదర్శిని మహిళా డిగ్రీ కాలేజీలో 486 సీట్లు, సైఫాబాద్ యూనివర్సిటీ సైన్స్ కాలేజీలో 265 సీట్లు, ప్రభుత్వ సిటీ కాలేజీలో 261 సీట్లు, వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 236 సీట్లు, బీజేఆర్ కాలేజీలో 228 సీట్లు, ఖైరతాబాద్ డిగ్రీ కాలేజీలో 225 సీట్లు, హుస్సేనీఆలం ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో 171 సీట్లు, ఫలక్‌నుమా ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 133 సీట్లు, సికింద్రాబాద్ పీజీ కాలేజీలో 118 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈనెల 15,16 తేదీల్లో ప్రభుత్వ డిగ్రీ కాలేజీలతోపాటు ఎయిడెడ్ డిగ్రీ కాలేజీల్లో (రెగ్యులర్ కోర్సులు మాత్రమే) స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ ఉంటుందని అన్నారు. ఈనెల 17న ఆయా కాలేజీలు స్పాట్ అడ్మిషన్ల వివరాలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈనెల 18,19 తేదీల్లో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు డిగ్రీ కాలేజీల్లో స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియను చేపడతామని వివరించారు. స్థానికులతోపాటు స్థానికేతరుల (ఇతర రాష్ట్రాల విద్యార్థులు) కు ప్రవేశాలు కల్పిస్తామని అన్నారు. ఈనెల 20న అప్‌లోడ్ చేయాలని కోరారు. విద్యార్థులు ఇతర వివరాల కోసం https://dost.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

కులగణనలో దేశానికే రోల్ మోడల్‌గా తెలంగాణ

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని మంత్రుల నివాస సముదాయంలో ఈ నెల15న కామారెడ్డి లో నిర్వహించే బహిరంగ సభ ఏర్పాట్లపై పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకాటి శ్రీహరి, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, ముఖ్యమంత్రి సలహాదారులు వేం నరేందర్ రెడ్డి ,రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, శాసనసభ్యులు మదన్‌మోహన్ రావు తదితరులతో కలిసి ఆయన సమీక్షించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లను బీసిల కోసం తీసుకొస్తుంటే కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటున్నదని ఈ సందర్భంగా తెలిపారు. కామారెడ్డి వేదికగా ఇచ్చిన బీసీ కులగణన హామీని సిఎం రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో సాధించామని వివరించారు. కామారెడ్డిలో నిర్వహించే బహిరంగ సభ చాలా ప్రతిష్టాత్మకమైందనీ, ఈ సభను విజయవంతం చేయటానికి చర్చించామని తెలిపారు.

జిహెచ్‌ఎంసిలో పర్సనల్ టాక్స్ !

- రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో టాక్స్ ఇన్స్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్ల నిర్వాకం
- గ్రేటర్ హైదరాబాద్ ఆదాయానికి కోట్లలో గండి
- కమర్షియల్ ప్రాపర్టీ రెసిడెన్షియల్ ప్రాపర్టీగా టాక్స్
- భారీ గోదాములకు నో టాక్స్ ... పర్సనల్ టాక్స్ అమలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పర్సనల్ టాక్స్ చర్చనీయాంశమవుతోంది. గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రాపర్టీ టాక్స్ వసూళ్ల విషయంలో చాలా సర్కిళ్లలో భారీగా అవినీతి చోటు చేసుకుంటుంది. జీహెచ్‌ఎంసీ పరిధిలోనిరాజేంద్రనగర్ సర్కిల్‌లో టాక్స్ ఇన్స్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్ల పనితీరు వివాదాస్పదంగా మారింది. గ్రేటర్ ఆదాయానికి గండికొట్టి వారు పర్సనల్ ఆదాయాన్ని పెంచుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కమర్షియల్ ప్రాపర్టీలు రెసిడెన్షియల్‌గా..

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని చాలా కమర్షియల్ ప్రాపర్టీలను టాక్సీ ఇన్స్‌స్పెక్టర్లు రెసిడెన్షియల్ ప్రాపర్టీస్‌గా చూపించి యజమానుల దగ్గర లక్షల రూపాయలు దోచుకుంటున్నట్టు ఫిర్యాదులు ఉన్నాయి. వాస్తవాలు బయటకు వచ్చినా అధికారులు చర్యలు తీసుకునేందుకు వెనుకాడుతుండటం గమనార్హం. ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నా చూసీచూడనట్టు వ్యవహరించడం సరికాదని పలువురు సూచిస్తున్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని డాకెట్ నెంబర్ 603లో (పీటీఐ నెంబర్ 1060601093లో) ఉన్న ప్రాపర్టీ రెసిడెన్షియల్ ప్రాపర్టీగా చూపించి సంవత్సరానికి రూ.232 మాత్రమే టాక్స్ విధించారు. కానీ వాస్తవంగా అక్కడ ఆ ప్రాపర్టీ మొత్తం కమర్షియల్ ప్రాపర్టీగా ఉంది. అదేవిధంగా శివరాంపల్లిలోని ప్రధాన రహదారిపై ఉన్న కమర్షియల్ ప్రాపర్టీలో (పీటీఐ నెంబర్ 1060635679) మార్బల్ షాప్ ఏర్పాటు చేశారు. అయితే ఈ ప్రాపర్టీని పూర్తిగా రెసిడెన్షియల్ ప్రాపర్టీగా చూపించి ప్రధాన రహదారిపై ఉన్న ఈ కమర్షియల్ కాంప్లెక్స్‌ను సబ్ జోన్ బి కేటగిరిలో ఉంచి దీనికి టాక్స్ పూర్తిగా తక్కువ చేసి చూపించారు. ఉప్పర్‌పల్లిలోని మంత్ర మహల్ పక్కన ఉన్న మరో కమర్షియల్ ప్రాపర్టీ (పీటీఐ నెంబర్ 1060201829)లో ప్లెన్త్ ఏరియా తక్కువగా చూపించి ఇక్కడి టాక్సీ ఇన్స్‌స్పెక్టర్ ఆ కమర్షియల్ ప్రాపర్టీకి నామమాత్రం టాక్స్ విధించి చేతులు దులుపుకున్నారు.

గోదాంలకు, షెడ్లకు నో టాక్స్

సర్కిల్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో ఇప్పటివరకు కొన్ని గోదామ్‌లకు, షెడ్లకు ఎలాంటి టాక్స్ నెంబర్ కూడా లేదు. కానీ ఇక్కడి టాక్సీ ఇన్స్‌స్పెక్టర్లు చూసిచూడనట్టు వ్యవహరించి, ఆ గోదాంల యజమానుల దగ్గర నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. మైలార్‌దేవ్‌పల్లిలోని డాకెట్ నెంబర్ 603లో శివరాంపల్లి రైల్వే స్టేషన్ పక్కన ఉన్న సుమారు 5 గోదాంలకు ఇప్పటివరకు ఎలాంటి టాక్స్ విధించలేదు. ఆ గోదాంలు కట్టి ఏండ్లు గడుస్తున్నా వీటికి టాక్స్ వేయకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అదేవిధంగా బృందావన్‌కాలనీలో ఉన్న రెండు భారీ కమర్షియల్ షెడ్లకు ఒకదానికి మాత్రమే టాక్స్ విధించారు. ఇంకో గోదాంకు టాక్సీ విధించకుండా అధికారులు వదిలేశారు. ఆ రెండు గోదాంల యజమాని ఒకరే కావడంతో ఒకే నెంబర్ తీసుకుని రెండు గోదాములకు ఒక నెంబర్ చూపిస్తున్నాడు. ఇందిరా గాంధీ హౌసింగ్ సొసైటీలో చాలా కమర్షియల్ గోదాంలకు అక్కడి టాక్సీ ఇన్స్‌స్పెక్టర్లు నామమాత్రంగా టాక్సీ విధించి జీహెచ్‌ఎంసీ ఆదాయానికి గండి కొడుతున్నారు. గగన్‌పహాడ్‌లోని పలు కమర్షియల్ గోదాములను రెసిడెన్షియల్‌గా మార్చి గతంలో పనిచేసిన కమిషనర్ భారీగా అవకతవకలకు పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఆరాంఘర్ నుంచి దుర్గానగర్ వైపు వెళ్తున్న ప్రధాన రహదారిపై ఒక వ్యక్తి ఒక ఎకరం పైగా స్థలంలో నాలుగు గోదాంలో నిర్మించి ప్లాస్టిక్ పరిశ్రమ, మార్బల్ షాప్, ఇతర గోదాంలు నిర్మించాడు. వీటన్నింటికీ కలిపి అతి తక్కువ టాక్స్ విధించి టాక్సీ ఇన్స్‌స్పెక్టర్ చేతులు దులుపుకున్నారు.

అధికారుల పర్యవేకణా లోపం

టాక్సీ ఇన్స్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల వారు ఆడింది ఆట.. పాడింది పాటగా మారింది. కొంతమంది టాక్స్ ఇన్స్‌స్పెక్టర్లు దశాబ్ద కాలంగా ఇక్కడే పని చేస్తూ ఉండడం, వేరే ప్రాంతానికి బదిలీపై వెళ్లినా పైరవీలతో మళ్లీ రాజేంద్రనగర్ సర్కిల్‌కు వస్తున్నారు. ఇక్కడ వ్యక్తిగత ఆదాయం ఎక్కువగా ఉండడంతో వేరే ప్రాంతానికి వెళ్లి పని చేయడానికి పలువురు ఇష్టపడడం లేదు. క్షేత్రస్థాయిలో వెళ్లి వీరి పనితీరును పర్యవేక్షించాల్సిన ఏఎంసీలు కార్యాలయానికే పరిమితం కావడంతో వీరి అవినీతి రోజురోజుకూ పెరుగుతున్నది. గతంలో పలువురు ఏసీబీ దాడులలో పట్టుబడినా ప్రస్తుతం పని చేసిన వారిలో ఎలాంటి మార్పు రావడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

కఠిన చర్యలు తీసుకుంటాం

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో టాక్సీ ఇన్స్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు చేస్తున్న అక్రమాలకు ఉన్నతస్థాయిలో దర్యాప్తు చేస్తున్నాం. జీహెచ్‌ఎంసీ ఆదాయానికి గండి పడేటట్టు చేస్తున్న టాక్సీ ఇన్స్‌స్పెక్టర్లపై కఠిన చర్యలు తప్పవు. ఇకనుంచి క్షేత్రస్థాయిలో పర్యటించి ఆదాయాన్ని పెంచడానికి కృషి చేస్తాం.

- సురేందర్‌రెడ్డి, రాజేంద్రనగర్ సర్కిల్ నూతన కమిషనర్

ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో కూలిన పైకప్పు

- దెబ్బతిన్న ట్రెజరీ కార్యాలయం
- పరుగులు తీసిన కాపలా పోలీసులు
- తప్పిన పెను ప్రమాదం ...
- భయాందోళనలో సిబ్బంది

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



కొద్దిరోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు గురువారం ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయ భవనం పైకప్పు కూలింది. సాయంత్రం కురిసిన భారీ వర్షం కారణంగా కలెక్టరేట్‌లోని మొదటి అంతస్తులోని పైకప్పు విరిగి వరండాపై పడింది. ఏఓ ఛాంబర్ నుంచి డి-సెక్షన్ వరకు ఓ భాగం మొత్తం కూలింది. కింద ట్రెజరీ కార్యాలయానికి సంబంధించిన విభాగం దెబ్బతింది. ట్రెజరీ కార్యాలయం ముందు పహారా కాస్తున్న ఇద్దరు పోలీసులు ఒక్క సారిగా పైకప్పు కూలడంతో బయటకు పరుగులు తీశారు. ఛిద్రపరిచిన ఫైళ్లు దెబ్బతిన్నాయి. ఏఓ ఛాంబర్ నుంచి డి-సెక్షన్ వరకు వరండా పూర్తిగా కూలడంతో ఆ గదులకు వెళ్లనేని పరిస్థితి నెలకొంది. అందులో విలువైన కంప్యూటర్లు ఫైళ్లు ఉన్నాయి. వాటిని బయటకు తీయడానికి వీల్లేకుండా భవనం ధ్వంసమైంది. విషయం తెలుసుకున్న అధికారులు కలెక్టరేట్‌కు వచ్చి భవనాన్ని పరిశీలించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు.

తప్పిన ప్రాణ నష్టం

జిల్లాలో ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటన ఉండటంతో కార్యాలయంలో పనిచేస్తున్న దాదాపు తహసీల్దార్ స్థాయి అధికారులు ఆయన వెంట ఉండటంతో ప్రమాదం తప్పిందని పలువురు పేర్కొన్నారు. సుమారు సాయంత్రం ఏడు గంటల సమయంలో కూలడంతో ఉద్యోగులు అప్పటికే వెళ్లిపోయారు. ప్రతి రోజు పదుల సంఖ్యలో కలెక్టరేట్‌కు వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. ఈ ప్రమాదం మధ్యాహ్నం పూట జరిగి ఉంటే ప్రాణనష్టం జరిగుండేదని అధికారులు చెబుతున్నారు. జనం ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఆయా విభాగాల్లో తహసీల్దార్ స్థాయి అధికారులతో పాటు సిబ్బంది సుమారు 40 మంది వరకు పనిచేస్తుంటారు. ఏదేమైనా ప్రాణ నష్టం జరగలేదని, కానీ విధులు నిర్వర్తించాలంటేనే భయమేస్తోందని ఉద్యోగులు, సిబ్బంది పేర్కొంటున్నారు. ఇదిలా ఉంటగా కొత్త కలెక్టరేట్ నిర్మాణం జరిగిన ఏండ్లు అవుతున్నా ఇప్పటివరకు పూర్తి కాలేదు. నిధుల్లేక మధ్యలోనే పనులు ఆగిపోయాయి.

రూ. 6.11 కోట్ల రివాల్వింగ్ ఫండ్ మంజూరు

- 4079 మహిళా సంఘాలకు లబ్ధి
- మహిళా సంఘానికి రూ.15 వేలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని మహిళా సంఘాలకు రూ.6.11 కోట్ల రివాల్వింగ్ ఫండ్‌ను గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ(సెర్ప్) విడుదల చేసింది. ఈ మేరకు సెర్ప్ సీఈఓ దివ్యదేవరాజన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఆర్ఎఫ్ గ్రాంట్ ఎల్ఆర్ఎల్ఎమ్ ప్రాజెక్టు కింద విడుదలైంది. దీని ద్వారా రాష్ట్రంలోని 4079 కొత్త మహిళా సంఘాలకు లబ్ది చేకూరనున్నది. ఒక్కో మహిళా సంఘానికి రూ.15 వేలు అందనున్నాయి. మొత్తంగా 32 జిల్లాలకు 6,11,85,000 రూపాయలు విడుదలయ్యాయి. మహబూబాబాద్ జిల్లాలో అత్యధికంగా 397 సంఘాలకు లబ్ది చేకూరనున్నది. ఆ జిల్లాకు 59,55,00 ఆర్ఎఫ్ గ్రాంట్ విడుదలైంది. అత్యల్పంగా మంచిర్యాల జిల్లాలోని మూడు కొత్త సంఘాలకు రూ.45,000 అందనున్నాయి.

కర్ణాటకకు చేరుకున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బెంగళూరులో 3రోజులపాటు జరగనున్న 11వ కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సిపిఎ) ఇండియా రీజియన్ కాన్ఫరెన్స్‌లో పాల్గొనేందుకు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తాసుఖేందర్‌రెడ్డి, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి నరసింహాచార్యులు, అధికారులు గురువారం కర్ణాటకకు చేరుకున్నారు. వారికి కర్ణాటక విధాన్ సౌద వద్ద అధికారులు ఘన స్వాగతం పలికారు. శుక్రవారం నుంచి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ఆయా రాష్ట్రాల స్పీకర్లు, చైర్మన్లు, కార్యదర్శులు తదితరులు పాల్గొంటారు.

నగరంలో చిన్న ఏజెన్సీలు బతకొద్దా?

- 68 జిఒతో 3 పెద్ద హోర్డింగ్ ఏజెన్సీలకే లాభం
- ఆ ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలి : జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జిహెచ్ఎంసి పరిధిలో చిన్న ఏజెన్సీలకు అనుమతి లేకుండా 2020లో బిఆర్ఎస్ ప్రభుత్వం జీవో నెంబర్ 68ని తెచ్చిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. ఆ జిఒ వల్ల కేవలం మూడు హోర్డింగ్ ఏజెన్సీలకే లాభం కలుగుతోందని తెలిపారు. హైదరాబాద్‌లో చిన్న ఏజెన్సీలు బతకొద్దా అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 68 జిఒను తక్షణమే రద్దు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. ఈ మేరకు జాన్‌వెస్లీ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిహెచ్ఎంసి పరిధిలో 208 హోర్డింగ్ ఏజెన్సీలున్నాయని వివరించారు. ఈ ఏజెన్సీలు సరిగ్గా పనిచేయడం లేదనే నెపంతో 2020లో అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం 68 జిఒని తెచ్చి ఈ ఏజెన్సీలను రద్దు చేసిందని తెలిపారు. జిహెచ్ఎంసి పరిధిలో చిన్న ఏజెన్సీలను లేకుండా చేసిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కేవలం మూడు పెద్ద ఏజెన్సీలకే లాభం చేకూర్చేలా కట్టబెడుతున్నదని విమర్శించారు. ఇతర మున్సిపల్ కార్పొరేషన్లలో చిన్న హోర్డింగ్ ఏజెన్సీలు తమ కార్యక్రమాలు కొనసాగిస్తుంటే, వాటిని కూడా అడ్డుకుని, హోర్డింగ్‌లు తొలగించే పనులకు ప్రభుత్వం పూనుకుంటున్నదని వివరించారు. 68 జిఒను రద్దు చేయకుంటే ఆ న్యాయమైన సమస్య పరిష్కారానికి సిపిఎం అండగా ఉండి, ఉద్యమాలను తీవ్రతరం చేస్తుందని హెచ్చరించారు. చదుకుని, ఉద్యోగాలు రాక జీవనోపాధి నిమిత్తం నిరుద్యోగులు ఏజెన్సీలు పెట్టుకుని ఈ రంగంలో పనిచేస్తున్నారని తెలిపారు. 68 జీవో వల్ల సుమారు 50 వేల కుటుంబాలు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై గత ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ స్పందించి మ్యానిఫెస్టోలో '68 జీవోని రద్దు చేస్తాం. హోర్డింగ్‌లపై అధికార పార్టీ గుత్తాధిపత్యాన్ని తొలగించి వాటిపై ఆధారపడిన కుటుంబాల వారిని రక్షిస్తాం, చేయూతనిస్తాం'అని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 21 నెలలు దాటినా, వారి సమస్యలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడానికి తక్షణమే 68 జిఒను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని చిన్న, పెద్ద ఏజెన్సీలకు తోడ్పాటునివ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.



జాన్‌వెస్లీకి వినతి పత్రం అందజేస్తున్న తెలంగాణ అవుట్‌డోర్ మీడియా ఓనర్స్ అసోసియేషన్ బృందం

హోర్డింగ్ పరిశ్రమ కోసం కొత్త విధానాన్ని తేవాలి

హోర్డింగ్ పరిశ్రమను బలోపేతం చేయాలనీ, ఆదాయ ఉత్పత్తి మాడ్యూళ్లు, ప్రజల భద్రత కోసం కొత్త విధానాన్ని రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. ఆయన్ను గురువారం హైదరాబాద్‌లో తెలంగాణ అవుట్‌డోర్ మీడియా ఓనర్స్ అసోసియేషన్ బృందం కలిసి వినతిపత్రం అందజేసింది. సమస్యలను వివరించింది. సమస్యల పరిష్కారం కోసం ప్రజాసంఘాలు, సంస్థలు, పార్టీలను కలుపుకుని ఏజెన్సీలు ఉద్యమించాలని కోరారు. వారి న్యాయమైన సమస్య పరిష్కారానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. తెలంగాణ అవుట్‌డోర్ మీడియా ఓనర్స్ అసోసియేషన్‌తో రాష్ట్ర ప్రభుత్వం చర్చించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు టి జ్యోతి, సీనియర్ నాయకులు డిజి నరసింహారావు, అసోసియేషన్ నాయకులు రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన కాళోజీ కవితలు

- ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్న రెడ్డి

ప్రజాశక్తి - కల్చరల్



తెలంగాణ ప్రాంతానికి అన్యాయం చేస్తే ప్రాంతేతరుడు అయితే తరిమికొడతాం ప్రాంతీయుడు అయితే ఇక్కడే పాతి పెడతామని అని చెప్పిన కాళోజీ కవిత తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసినది అని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాదక్షులు చిన్న రెడ్డి అన్నారు. రవీంద్ర భారతి ప్రధాన వేదికపై గీతా ఫౌండేషన్, గీతా ఆర్ట్ అకాడమీ నిర్వహణలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ధిక్కార స్వరం కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా నిర్వహించిన తెలంగాణ భాషా దినోత్సవానికి ముఖ్య అతిథిగా చిన్న రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కవి యాకుబ్, తెలంగాణ సారస్వత పరిషత్ కార్యదర్శి డాక్టర్ చెన్నయ్యకు, రంగస్థల నటుడు భాను మూర్తికి, ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత శ్రీధరాచార్యులు గురువు కొండూరు హరినారాయణలకు కాళోజీ సాహిత్య స్ఫూర్తి పురస్కారాలు బహుకరించి అభినందించారు.

సామాజిక అణచివేత అరికట్టాలి

- సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



సమాజంలో పని ప్రదేశాల్లో పురుషులతో పాటుగా మహిళలకు కూడా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సామాజిక అణిచివేతను అరికకడుతూ పని భద్రత కల్పించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ కోరారు. గురువారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో జరిగిన కార్మిక కర్షక భవనం శ్రామిక మహిళా సదస్సులో ఆమె మాట్లాడారు. 1979 నుండి కార్మిక వర్గంలో ఉన్న శ్రామిక మహిళలు పని ప్రదేశాల్లో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వాలు మారినా మహిళలకు భద్రత కరువైందని పని ప్రదేశాల్లో వేధింపులు ఆర్థిక అసమానతలు నేటికీ కొనసాగుతున్నాయన్నారు. షాపింగ్ కాంప్లెక్స్‌లో ప్రయివేటు హాస్పిటల్లో, ప్రయివేటు పాఠశాలలో తదితర సంస్థల్లో పని చేస్తున్న మహిళలకు తగిన గుర్తింపు ఇవ్వడం లేదన్నారు. శ్రామిక మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రవీణ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో సిఐటియు జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ ఎం పద్మ, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, శ్రామిక మహిళలు రేణుక, భాగ్యలక్ష్మి, లత దేవమ్మ రేణుక సుజాత తదితరులు పాల్గొన్నారు.

సమస్య తీరే దాకా వెనక్కితగ్గం

- కొనసాగుతున్న టీమ్స్ డ్రైవర్ల నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



పని భారం తగ్గి, అధికారుల వైఖరిలో మార్పు వచ్చేంతవరకూ ఆందోళననుంచి వెనక్కు తగ్గబోమంటూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం ఆర్‌టిసి టీమ్స్ డ్రైవర్లు నిరసనను కొనసాగిస్తున్నారు. టీమ్స్ డ్రైవర్లపై పని భారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ సోమవారం అర్ధరాత్రి నుంచి మెరుపు సమ్మెకు దిగిన సుమారు 60 మంది డ్రైవర్లు గురువారం సైతం విధులకు హాజరుకాలేదు. ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణలోనే దోమలను సైతం లెక్క చేయకుండా అక్కడే నిద్రించి తమ నిరసనను కొనసాగిస్తున్నారు. ఆందోళన చేస్తున్న కార్మికులకు కార్మిక సంఘాలతో పాటు వివిధ రాజకీయ పక్షాల మద్దతు తెలిపాయి. రీజనల్ మేనేజరే స్వయంగా వచ్చి తమ సమస్యలు పరిష్కరించే వరకూ తమ నిరసనను విరమించేది లేదని తేల్చి చెప్తున్నారు. టీమ్స్ డ్రైవర్ల పై పని భారం పెరిగి ఒకే వారంలో దాదాపు ఎనిమిది మంది డ్రైవర్లు అనారోగ్య పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ అవసరాల కోసం సెలవు అడిగినా ఇవ్వకుండా అధికారులు వేధిస్తున్నారని కార్మికుతు తెలిపారు. వీటికి ప్రధాన కారణం డిపో మేనేజర్‌నేనని కార్మికులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు విచారణ చేపడితే అనేక విషయాలు వెలుగులోకి వస్తాయని వారు స్పష్టం చేస్తున్నారు.

సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమం ఉధృతం
సిఐటియు జిల్లా కార్యదర్శి ఏజే రమేష్

టీమ్స్ డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఆర్‌టిసి యాజమాన్యం పరిష్కరించాలి. ఆందోళన చేస్తున్న వారికి సిఐటియు పూర్తి మద్ధతిస్తుంది. గురువారం బస్టాండ్ ఆవరణలో నిరసన కొనసాగిస్తున్న డ్రైవర్లకు సీఐటీయూ బృందం వెళ్లి మద్దతు ప్రకటించాం. భద్రాచలం డిపో మేనేజర్ వైఖరి వల్ల గత సంవత్సర కాలంగా కార్మికులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. ఆర్‌టిసిలో యూనియన్లు రద్దు అయిన నాటి నుండి కార్మికులపై వేధింపులు అంతకంతకు పెరుగుతున్నాయి. సంఘీభావం తెలిపిన వారిలో సిఐటియు పట్టణ కన్వీనర్ బండారు శరత్ బాబు, జిల్లా ఉపాధ్యక్షులు ఎంబి నర్సారెడ్డి, సీనియర్ నాయకులు ఎంవిఎస్ నారాయణ, ముత్తయ్య ఉన్నారు.

అర్హత లేని ఎస్‌డిఐ రాజీనామా..?

డిపో మేనేజర్‌గా తిరుపతి బాధ్యతలు చేపట్టిన తరువాత అర్హత లేని వ్యక్తులను కూడా ఉన్నత స్థానంలో కూర్చోపెట్టినట్టు ఆరోపణలు ఉన్నాయి. సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ బాధ్యతలను అర్హత లేని వ్యక్తికి కట్టబెట్టారని కార్మికుతు ఆరోపించారు. ఎస్‌డీఐ బాధ్యతలు చేపట్టిన సదరు వ్యక్తి డ్రైవర్‌గా విధులు నిర్వహించే సందర్భంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ సైతం మృతి చెందగా కొంతకాలం సస్పెండ్‌కు గురయ్యారు. ప్రస్తుతం ఆ కేసు కోర్టులో ఉంది. అటువంటి వ్యక్తిని సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్‌గా నియమించడం ఏమిటని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. దిద్దుబాటు చర్యలో భాగంగా మంగళవారం ఆ వ్యక్తి తన బాధ్యతలు నుండి వైదొలుగుతున్నట్టు రాతపూర్వకంగా రాసిచ్చారని తెలుస్తోంది. అన్నిటిపైనా విచారణ చేపట్టాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

సమస్యలు ఉంటే ఎంప్లాయిస్ వెల్ఫేర్ బోర్డు సభ్యుల దృష్టికి తీసుకువెళ్లాలి
ఖమ్మం ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సరిరామ్ నాయక్

టీమ్స్ డ్రైవర్ల సమ్మె నేపథ్యంలో ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలు చూస్తున్నాం. ఏమైనా సమస్యలు ఉంటే ఎంప్లాయిస్ వెల్ఫేర్ బోర్డు సభ్యుల దృష్టికి తీసుకువచ్చి సమస్యలను పరిష్కరించుకోవాలి. ఈ నెల 5వ తేదీనే ఎగ్జిక్యూటివ్ మెంబర్‌తో కలిసి భద్రాచలం పర్యటించాం. గేటు మీటింగ్ కూడా ఏర్పాటు చేశాం. అప్పుడు ఎవరు ఏ సమస్యనూ మా దృష్టికి తీసుకు రాలేదు. ఇప్పటికైనా తమ సమస్యలను వెల్ఫేర్ బోర్డు సభ్యుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలి. ఒకే వారంలో ఎనిమిది మంది డ్రైవర్లు సిక్ అయిన విషయం మాకు తెలియదు. ఒక కార్మికుడికి అనారోగ్యంగా ఉన్నారని తెలిస్తే తార్నాక ఆర్టీసీ ఆస్పత్రికి పంపించాం. కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం.

పియర్సన్, సేల్స్‌ఫోర్స్ ఒప్పందం

హైదరాబాద్ : పియర్సన్‌కు చెందిన కంప్యూటర్ ఆధారిత ఎగ్జామ్స్‌ను నిర్వహించే పియర్సన్ వీయూ తాజాగా సేల్స్‌ఫోర్స్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపింది. ఇరు సంస్థలు కలిసి ఆధునిక సాంకేతికతలు, ఎఐ వ్యాపార పని విధానం, నైపుణ్యాలకు పదును పెట్టనున్నట్లు పేర్కొంది. పరీక్ష వ్యవస్థలను సేల్స్‌ఫోర్స్ సర్టిఫికేషన్ కార్యక్రమంతో అనుసంధానం చేయడం ద్వారా ఉద్యోగులు, యాజమానులకు సేల్స్‌ఫోర్స్ నైపుణ్యాలను అందించనున్నట్లు పియర్సన్ వియుఇ ఎండి గ్యారీ గేట్స్ పేర్కొన్నారు.

కాంట్రాక్ట్ నర్సింగ్ ఆఫీసర్లకు ఐదు నెలల జీతం విడుదల చేయాలి

- ఎఐటియుసి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వాస్పత్రుల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ నర్సింగ్ ఆఫీసర్లకు ఐదు నెలల జీతాన్ని వెంటనే చెల్లించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) డిమాండ్ చేసింది. గురువారం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో టిమ్స్ ఆస్పత్రి నుంచి వివిధ ఆస్పత్రుల్లో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ నర్సింగ్ ఆఫీసర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ మాట్లాడుతూ తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టీమ్స్) ఆస్పత్రిలో కరోనా సమయంలో సేవలందించేందుకు 160 మంది కాంట్రాక్ట్ నర్సింగ్ ఆఫీసర్లను నియమించుకున్నట్లు తెలిపారు. 2022లో వారిని నిలోఫర్, ఉస్మానియా, సరోజినీ, కోటి మెటర్నిటీ ఆస్పత్రులకు డిప్యూటేషన్‌పై అధికారులు పంపించారని తెలిపారు. వారికి గత ఏప్రిల్ నెల నుంచి జీతాలు చెల్లించడం లేదని విమర్శించారు. ఈ విషయంపై ఆయా ఆస్పత్రుల సూపరింటెండెంట్లకు, రాష్ట్ర వైద్యవిద్య సంచాలకునికి పలుసార్లు విన్నవించినప్పటికీ ప్రయోజనం లేకపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నెలల తరబడి జీతాలు రాకపోవడంతో వారంతా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. వీరి సమస్యలపై వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి విన్నవించనున్నట్టు తెలిపారు. సమస్య పరిష్కారం కాకపోతే రాబోయే రోజుల్లో ఆందోళనా కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఆకాశానికి చిల్లులు పడ్డట్టు.. నిమిషాల వ్యవధిలో భారీ వర్షం..

- రాష్ట్రంలో పలుచోట్ల కుండపోత... అతలాకుతలం
- చెరువులను తలపించిన రహదారులు
- హైదరాబాద్‌లో పొంగిన డ్రెయినేజీలు..
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- శివారు ప్రాంతాల్లో ముంచెత్తిన వాన
- ట్రాఫిక్‌కు అంతరాయం
- మెదక్‌లో 17.65 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



రాష్ట్రంలో గురువారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు కురిసిన భారీ వర్షాలతో పలు ప్రాంతాలు అతలాకుతలంగా మారాయి. పలు ప్రాంతాల్లో కుండపోత వర్షం కురిసింది. ఆకాశానికి చిల్లులు పడ్డట్టుగా నిమిషాల వ్యవధిలోనే రోడ్లన్నీ జలమయం అయ్యాయి. చెరువులను తలపించాయి. డ్రయినేజీలు పొంగిపొర్లాయి. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో వానం ముంచెత్తింది. కొద్దిసేపు వర్షం పడినా భారీ వర్షపాతాలు నమోదయ్యాయి. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం మోస్తరు నుంచి భారీ వర్షం పడింది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, షేక్‌పేట, ఉప్పల్, బోడుప్పల్, పీర్జాదిగూడ, ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్, శామీర్‌పేట, అంబర్‌పేట, అబ్దుల్లాపూర్‌మెట్, మేడ్చల్ పరిసర ప్రాంతాల్లో వర్షం పడింది. హయత్‌నగర్-విజయవాడ రహదారిపై వర్షపు నీరు చేరడంతో పలు చోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రహదారులపై మోకాళ్ల లోతు నీరు చేరడంతో ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోయింది. రామోజీ ఫిల్మ్‌సిటీ ప్రాంతంలో గంటన్నర పాటు కుండపోత వర్షం కురిసింది. భారీ వర్షానికి హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. లోతట్టు ప్రాంతాల్లోకి భారీగా వరద నీరు చేరడంతో.. చెరువులను తలపిస్తున్నాయి. ఒక్కసారిగా కురిసిన వాన వరదలా మారడంతో ప్రజలు సమస్యలు ఎదుర్కొన్నారు. హయత్‌నగర్‌లో అత్యధికంగా తొమ్మిది సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. వనస్థలిపురంలో వర్షపు నీరు ఇండ్లల్లోకి చేరడంతో.. ప్రజలు అవస్థలు పడ్డారు. హయత్‌నగర్ కోర్టు, ఆర్‌టిసి డిపోలోకి వరద నీరు చేరింది. ప్రధానంగా హైదరాబాద్ నగర శివారు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది.

మెదక్ జిల్లా అతలాకుతలం

మెదక్ పట్టణంలో 17.5 సెం. మీ అతి భారీ వర్షం కురిసింది. భారీ వర్షాలకు గాంధీ నగర్, సాయి నగర్ కాలనీ, వెంకట్రావు నగర్ నీట మునిగింది. మెదక్ గవర్నమెంట్ గర్ల్స్ జూనియర్ కాలేజీలో భారీగా వరద నీరు చేరడంతో విద్యార్థులను కాలేజీ సిబ్బంది ఇంటికి పంపించారు. మెదక్- హైదరాబాద్ నేషనల్ హైవే చెరువును తలపిస్తున్నది. 15 రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు మెదక్ జిల్లా అతలాకుతలం అయిన విషయం విదితమే. పది మంది మృతి చెందారు. ముఖ్యమంత్రి రేవంత్ సైతం ఏరియల్ సర్వే చేశారు. ఏడుపాయల దేవాలయం 27 రోజులుగా జలదిగ్బంధంలోనే చిక్కుకుంది. కాగా గురువారం నుంచి దేవాలయంలో పూజలు ప్రారంభమయ్యాయి. ఆ ఘటనలు మరువకముందే తిరిగి గురువారం మెదక్ పట్టణాన్ని భారీ వర్షం ముంచెత్తింది. మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసి పంటలకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది. మళ్లీ వర్షం కురుస్తుండడంతో రైతులు ఆందోళన వ్యక్త చేశారు. కురుస్తున్న వర్షాలకు ఉన్న పంటలు సైతం నష్టపోయే ఆస్కారం ఉందన్నారు.

భారీ వర్షాలకు నీట మునిగిన పంటలు

ఉమ్మడి మహబబ్‌నగర్ జిల్లా గట్టు మండలంలో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పంట పొలాలు నీట మునిగిపోయాయి. చెరువులు నిండి అలుగుపారింది. పలు గ్రామాల్లో వాగులు ఉధతంగా ప్రవహించడంతో పంట పొలాలు నీట మునిగాయి. పంట నష్ట పోయిన రైతులకు నష్ట పరిహారం అందజేయాలని రైతులు కోరుతున్నారు. మాచర్ల గ్రామంలో దళితవాడలో ఉన్న పాఠశాల చుట్టూ మురికి నీరు నిలుస్తుండడంతో దుర్వాసన వస్తుందని విద్యార్థులు అంటున్నారు. పాఠశాలకు రావాలంటే చాలా భయమేస్తుందని, ఈ మురుగునీటితో పాటు వర్షపు నీరు పాఠశాలలోకి వచ్చి చేరుతోంది. మధ్యాహ్నం పూట అన్నం తినాలంటే ఆ వాసనకి తినలేక తింటున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. కల్వకుర్తి, తదితర ప్రాంతాల్లో వర్షాలు భారీగా పడ్డాయి.



తోషిబా ట్రాన్స్‌మిషన్‌కు ఇఇపిసి జాతీయ అవార్డు

హైదరాబాద్ : భారత ఎగుమతుల్లో అసాధారణ కృషి చేసినందుకుగాను తమ సంస్థకు ఇంజనీరింగ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఇఇపిసి) నుంచి జాతీయ అవార్డు దక్కిందని తోషిబా ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ (టిటిడిఐ) ఓ ప్రకటనలో వెల్లడించింది. ఇటీవల ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును కేంద్ర మంత్రి పియూష్ గోయల్ నుంచి అందుకున్నట్లు టిటిడిఐ సిఎండి హిరోషి పురాటా తెలిపారు.

ఐటిసి నుంచి అత్యధిక ప్రోటీన్ ఆటా విడుదల

హైదరాబాద్ : ఐటిసి లిమిటెడ్ కొత్తఃగా అత్యధిక ప్రోటీన్ కలిగిన ఆటాను విడుదల చేసినట్లు తెలిపింది. ఇది భారతీయుల రోజువారీ ప్రోటీన్ అవసరాలను సులభంగా తీర్చనుందని ఆ సంస్థ పేర్కొంది. గోధుమ, సోయా, శెనగలు, ఓట్స్ మిశ్రమంతో దీన్ని తయారు చేసినట్లు వెల్లడించింది. ప్రతీ 100 గ్రాములకు 15 గ్రాముల ప్రోటీన్ లభిస్తుందని ఆ కంపెనీ ప్రతినిధి అనుజ్ రుస్తగి తెలిపారు. దీని కిలో ప్యాక్ ధరను రూ.80-86గా నిర్ణయించింది.



హయ్యర్ పెన్షన్ కోసం బిడిఎల్ కార్మికులు ఉద్యమించాలి

- బిడిఇయు (సిఐటియు) గౌరవాధ్యక్షులు వెంకటేశ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హయ్యర్ పెన్షన్ కోసం బిడిఎల్, బిఇఎల్, ఇతర కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల కార్మికులంతా ఐక్యంగా ఉద్యమించాలని బీడీఈయూ(సీఐటీయూ అనుబంధం) గౌరవాధ్యక్షులు జె వెంకటేశ్ డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని బిడిఎల్ వద్ద నిరసన కార్యక్రమంలో చేపట్టారు. అందులో బీడీఈయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మురళి, సత్తయ్య, కోశాధికారి ఎం రవీందర్, డి రవికుమార్, కృష్ణారెడ్డి, జెడి మల్లేష్, వినోద్ సింగ్, కిరణ్ కిషోర్ యాదవ్, శ్రావణ్ తదితర ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జె వెంకటేశ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పెన్షన్ సంస్కరణలతో ప్రభుత్వరంగ కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదన్నారు. హయ్యర్ పెన్షన్ కోసం ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. బిడిఎల్ కార్మికులు హయ్యర్ పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఆప్షన్ ఇచ్చి అమలు చేయాలనీ, సాంకేతిక కారణాలను చూపి హయ్యర్ పెన్షన్‌ను నిరాకరించడం అన్యాయమని అన్నారు. మురళి, టి సత్తయ్య మాట్లాడుతూ.. హయ్యర్ పెన్షన్ కోసం హైదరాబాద్‌లోని కేంద్ర ప్రభుత్వరంగ పరిశ్రమల్లోని కార్మిక సంఘాలు ఐక్యంగా సమీకరించాలనీ, కార్మికులు న్యాయమైన సమస్యపై కలిసి రావాలని కోరారు.

హెచ్‌సియు విదార్థి సంఘం రద్దు రాజ్యాంగ విరుద్ధం

- విద్యార్థి హక్కులు కాలరాస్తున్న యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో గుర్తింపు పొందిన విద్యార్థి సంఘాన్ని పదవి కాలం పూర్తికాకముందే పక్షపాత ధోరణితో రద్దు చేయడం ధారుణమని ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్రకమిటీ పేర్కొన్నది. యూనియన్ సభ్యులకు కూడా సమాచారం ఇవ్వకుండా యూనివర్శిటీ అడ్మినిస్ట్రేషన్ రాజ్యాంగ విరుద్ధంగా ఇలా వ్యవహరించడం దుర్మార్గమని విమర్శించింది. ఈ మేరకు గురువారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.రజనీకాంత్, టి.నాగరాజు ఒక ప్రకటన విడుదల చేశారు. అడ్మినిస్ట్రేషన్ తీసుకున్న నిర్ణయం లింగ్డో కమిటీ సిఫారసులను, విశ్వవిద్యాలయాలలో విద్యార్థులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను ఉల్లంఘించటమేనని పేర్కొన్నారు. రాజకీయ దురుద్దేశంతో వైస్ ఛాన్సలర్ ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. అది విద్యార్థి హక్కులతో పాటు యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిపై నేరుగా దాడి చేయడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. యూనియన్ రద్దు నిర్ణయాన్ని యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ వెనక్కి తీసుకోవాలని, లింగ్డో కమిటీ సిఫారసులను అమలు చేయాలని, రాజ్యాంగబద్ధంగా గుర్తింపు సంఘం పదవీకాలం పూర్తిచేసుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.

హైదరాబాద్‌లో ఎంజి సెలెక్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్



ఆటోమొబైల్ కంపెనీ ఎంజి మోటార్స్ తన నూతన ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసింది. బంజారాహిల్స్‌లోని ఈ ఎంజి సెలెక్ట్ సెంటర్‌ను గురువారం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి చంద్ర శేఖర్ పెమ్మసాని లాంచనంగా ప్రారంభించారు. ఇక్కడ నూతన తరానికి చెందిన లగ్జరీ కార్లను ప్రదర్శించనున్నట్లు ఎంజి సెలెక్ట్ హెడ్ మిలింద్ సా పేర్కొన్నారు.

సమాజాన్ని చదవకపోతే కవి కాలేడు

- కవి డాక్టర్ ఎన్ గోపి
- నిశ్శబ్ద మాధుర్యం కవితా సంపుటి ఆవిష్కరణ

ప్రజాశక్తి - కల్చరల్

సమాజాన్ని చదివకపోతే కవి కాలేడు అని ప్రఖ్యాత కవి డాక్టర్ ఎన్ గోపి అన్నారు. మహాకవి శ్రీశ్రీ ప్రపంచ బాధ తన బాధ అని చెబుతారు అంటే ఆయన సమాజంలో జరిగే సంఘటనలుకు ప్రతి స్పందించి కవిత్వంలో వ్యక్తీకరించటం వాళ్లనే అని చెప్పారు. వంశీ విజ్ఞాన పీఠం నిర్వహణలో త్యాగరాయ గాన సభలోని కళా సుబ్బారావు కళా వేదికపై జి.సాయి చంద్ర శేఖర్ రచించిన నిశ్శబ్ద మాధుర్యం కవితా సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ గోపి సంపుటినీ ఆవిష్కరించి మాట్లాడారు. సాయి చంద్ర శేఖర్ కవితల్లో కవిత్యం వస్తు ప్రాధాన్యంగా ఉంటుందని వివరించారు. శబ్దం కన్నా నిశ్శబ్దంలో మాధుర్యంను అర్థవంతంగా చంద్ర శేఖర్ కవితల్లో వ్యక్తీకరించారన్నారు. సభా ప్రారంభం చేసిన వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా స్థాపకుడు ప్రఖ్యాత వ్యంగ్య రచయిత వంగూరి చిట్టెన్ రాజు మాట్లాడుతూ.. కవితా సంపుటికి చంద్ర శేఖర్ నిశ్శబ్ద మాధుర్యం పేరు ఎంచుకోవటంలోనే వైవిధ్యం వుందని అభినందించారు. ప్రముఖ సాహితీ విమర్శకుడు డాక్టర్ రఘు సభకు అధ్యక్షత వహించగా ప్రముఖ కవి డాక్టర్ జి ఆదినారాయణ సంపుటినీ సమీక్ష చేశారు.